ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 04-11-2026 **సమయం : 6.45 గంటలు**

ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పార్టీలు అత్యధిక స్థానాల్లో విజయం సాధించాయి.

2. వరుస తుపాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

3. ఆంధ్రప్రదేశ్‌లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల రక్షణ, మౌలిక వసతుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

4. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో 13 రాష్ట్రాల పోలీసు శాఖలతో హైదరాబాద్‌లో సంయుక్త సైబర్ నేర సమన్వయ బృంద సమావేశం నిర్వహించారు.

==========

ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పార్టీలు అత్యధిక స్థానాల్లో విజయం సాధించాయి. రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల్లో మెజారిటీ స్థానాలల్లో కూటమి ఆధిక్యంలో నిలిచింది. ఎన్డీయే కూటమి తొమ్మిది నగరపాలక సంస్థల్లో మేయర్ పదవులు దక్కించుకోగా, మరో మూడు నగరపాలక సంస్థల్లో ఆధిక్యంలో నిలిచింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక స్థానంలో గెలిచింది. పురపాలక, నగర పంచాయతీల్లోనూ మొత్తం 79 స్థానాలకు గాను ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ 50కి పైగా, జనసేన 15కి పైగా స్థానాల్లో విజయం సాధించాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరులో , ఇతరులు 2 స్థానాల్లో విజయం సాధించారు.అలాగే రాష్ట్రంలో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు, చిత్తూరు, మచిలీపట్నం, కర్నూలు, కార్పొరేషన్లలో టీడీపీ మేయర్ అభ్యర్థులు విజయం సాధించగా ఏలూరు కార్పొరేషన్ మేయర్ స్థానంలో జనసేన గెలవగా.. అనంతపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇంకా పలు స్థానాల్లో ఫలితాలు వెల్లడి కావల్సి ఉంది.

వరుస తుపాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి నిన్న లేఖ రాశారు. ఓర్నబ్ తుఫాను ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే

మురసు తుపాను కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని వివరించారు. మురసు తుపాను వల్ల రాష్ట్రంలోని ఎనిమిది శాఖలకు సంబంధించి ప్రాథమికంగా 343 కోట్ల 95 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తుపాను నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందాన్ని పంపినందుకు అమిత్ షాకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న వెంటనే పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్, సాగునీటి వనరులకు జరిగిన నష్టంపై సమగ్ర అంచనాలు రూపొందించి కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

రాయలసీమలో కరవు సమస్యలను అధిగమించాలంటే పోలవరం సహా ప్రాధాన్య సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మురసు తుపాను పరిస్థితిపై అమరావతిలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రెండు తుపాన్ల ద్వారా 11 టీఎంసీల నీటిని జలాశయాలకు మళ్లించామని, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో 25 టీఎంసీల నీటిని నిల్వ చేశామని చెప్పారు. తుపాన్ల అనుభవాలను విశ్లేషించి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల రక్షణ, మౌలిక వసతుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాను సహాయక చర్యలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులతో అమరావతి నుంచి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గిన ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని, గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఆస్తి నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

మురసు తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రహదారుల భద్రత, రాకపోకల పునరుద్ధరణకు రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర రహదారులు, ప్రధాన జిల్లా రహదారులు, జాతీయ రహదారుల పరిధిలో మొత్తం 30 కంట్రోల్ రూమ్‌లు, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం 40 మంది సమన్వయ అధికారులను నియమించామన్నారు. 53 ప్రాంతాల్లో సిబ్బంది, యంత్రాలు, అవసరమైన సామగ్రితో సహాయక బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. రహదారులు, వంతెనలు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మురసు తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల పురపాలక సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపును రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. భారీ వర్షాలు, బలమైన గాలులు, వరద ముప్పు నేపథ్యంలో ఈ

నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎన్నికల సిబ్బంది భద్రత, బ్యాలెట్ బాక్సుల రక్షణను దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లా కలెక్టర్ చేసిన విజ్ఞప్తి మేరకు కౌంటింగ్‌ను ఈనెల 6వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి బహిరంగ ప్రచారం గత సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాలు ముగిశాయి. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, అవసరమైతే 6న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఈనెల 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సమన్వయంతో హైదరాబాద్‌లో జాయింట్ సైబర్ నేర సమన్వయ బృంద సమావేశం నిన్న నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 13 రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, సైబర్ నేరాలు వ్యవస్థీకృత పరిశ్రమగా మారాయని అన్నారు. నేరం జరిగిన తర్వాత నగదు రికవరీ చేయడం కంటే, అసలు నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాలపై రాష్ట్రాల మధ్య సమన్వయంతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ సహకారం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

పరిశోధన, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ హెచ్. పురుషోత్తం కోరారు. ఢిల్లీలో నీతి ఆయోగ్ నిర్వహించిన ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ స్కోర్‌బోర్డు ప్రారంభోత్సవంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ, రాష్ట్రాల సైన్స్ అండ్ టెక్నాలజీ స్కోర్‌బోర్డులో గ్లోబల్ ఇండియా ఇన్నోవేషన్ ఇండెక్స్‌లను చేర్చాలని సూచించారు. పరిశోధనా సంస్థలను బలోపేతం చేయడంతోపాటు పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. పరిశోధన ఫలితాలను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా సాంకేతిక అభివృద్ధికి మరింత చేయూత లభిస్తుందని పురుషోత్తం పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీపొట్టిరాములు నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్ ..30.. సెకన్లు